దారి చూపే.. దివ్య క్షేత్రం

- 14న జ్ఞానాపురం రక్షణగిరి మహోత్సవం
- భక్తిశ్రద్ధలతో క్రైస్తవుల నవదిన ప్రార్థనలు
- ప్రత్యేక ఆరాధనలకు ఏర్పాట్లు



ఉత్సవాలకు ముస్తాబైన జీసస్ విగ్రహం



జ్ఞానాపురం రక్షణగిరిపై నవదిన ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కంచరపాలెం: క్రైస్తవుల ప్రసిద్ధ ప్రార్థన మందిరాలకు నెలవుగా జ్ఞానాపురం రక్షణగిరి వన్నెకెక్కింది. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన పునీత పేతురు దేవాలయం, రక్షణగిరి తదితర చర్చిలు నేటికీ ఇక్కడ కళకళలాడుతున్నాయి. రక్షణగిరిపై ప్రభు ఏసుక్రీస్తును స్తుతిస్తూ ప్రార్థనలు చేస్తే మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక చింతన కలుగుతాయని క్రైస్తవుల ప్రగాఢ విశ్వాసం. దాదాపు వందేళ్ల కిందట గాలికొండగా పిలవబడి.. కాలక్రమేణా ఈ దివ్యక్షేత్రం రక్షణగిరిగా రూపాంతరం చెందింది. జ్ఞానాపురంలో రక్షణగిరి ఆవిర్భవించిన నాటి నుంచి నిత్య ప్రార్థనా కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. క్రైస్తవులు ఇక్కడి ఆధ్యాత్మిక యాత్రలో ఏళ్లుగా పాలుపంచుకుంటూ తరిస్తున్నారు. మతాలకు అతీతంగా ఇక్కడికి ప్రజలు తరలి వచ్చి ప్రార్థనలు చేస్తారని చర్చి ఫాదర్లు చెబుతున్నారు. అంతటి ప్రాధ్యనం గల రక్షణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవం ఈ నెల 14న అంగరంగ వైభవంగా జరగనుంది. వేడుకల్లో భాగంగా ఈ నెల 5 పతాకావిష్కరణతో నవదిన ప్రార్థనలు ప్రారంభించారు. అవి ఈ నెల 14 వరకు కొనసాగుతాయి.

క్రీస్తు రక్షకుని యాత్రలు

రక్షణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలను ప్రతి ఏటా ఘనంగా నిర్వహించేందుకు మే నెల రెండో ఆదివారం క్రీస్తు రక్షకుని యాత్ర వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని రెవరెండ్ ఫాదర్ రాజ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 14 వరకు జరిగే ఉత్సవాలకు ఉత్తరాంధ్ర నుంచి అధిక సంఖ్యలో క్రైస్తవులు తరలి వస్తుంటారు. తొమ్మిది రోజుల పాటు జపమాల, దివ్యబలి పూజలు, మఠవాస సంస్థలచే నవదిన జపములు నిర్వహిస్తారు. 14వ తేదీ ఆదివారం నాడు జరిగే ప్రధాన వేడుకల్లో దివ్యబలి పూజ, రక్షణగిరిపైకి పురప్రదక్షిణ, సమష్టి దివ్యబలి పూజలను విశాఖ అగ్రపీఠాధిపతి(ఆర్చ్ బిషప్) రెవరెండ్ ఫాదర్ మల్లవరపు ప్రకాష్ నిర్వహించనున్నారు. పుణ్యక్షేత్ర మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు రక్షణగిరి పత్రిక సంపాదకులు ఆదిరెడ్డి ఆల్బర్ట్, పారిస్ పాస్టిల్ కౌన్సిల్(పీపీసీ) ప్రతినిధి ఆదిరెడ్డి చార్లీ తెలిపారు.

రక్షణగిరిలో నిత్య కార్యక్రమాలు

- రక్షణగిరిలో ప్రత్యేక ప్రార్థనలతోపాటు ప్రతి శుక్రవారం సాయంత్రం అన్నసమారాధన.
- ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు దివ్యబలి అర్పణలు.
- రేయింబవళ్లు మఠకన్యల నిత్యారాధన.
- రోజంతా ఏసుక్రీస్తుతో విశ్వాసుల భావ ప్రకటన(ఆరాధన).
- ప్రతి నెలా మొదటి, మూడో శుక్రవారాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉపవాస ఆరాధన కూటములు, దివ్యబలి అర్పణలు.
- తపస్సు కాల శుక్రవారాల్లో సిలువ మార్గ తపో క్రియలు.
- జూన్ మొదటి ఆదివారం ఏసు తిరుహృదయ మహోత్సవ సంబరాలు
- ఆగస్టు 1 నుంచి 14 వరకు దేవమాత తేరు ఉత్సవాలు, ఆగష్టు 15న ప్రధాన పండగ నిర్వహిస్తారు. ఇలా ప్రత్యేక కార్యక్రమాలతో జ్ఞానాపురం రక్షణగిరి విరాజిల్లుతోంది.

రక్షణగిరి ఉత్సవాలకు ఏర్పాట్లు



ఈ నెల 14న నిర్వహించే జ్ఞానాపురం రక్షణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చే విశ్వాసులకు, ఆయా చర్చిల ఫాదర్లకు అన్ని సదుపాయాలు సమకూర్చాం. ప్రత్యేక ప్రార్థనలు, నవదిన ప్రార్థనల్లో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. అత్యంత ఘనంగా వేడుకలు నిర్వహించేందుకు క్రైస్తవులు, పీపీసీ సభ్యులు పూర్తి సహకారం అందిస్తున్నారు.

– రెవరెండ్ ఫాదర్ జాన్‌ప్రకాష్, పునీత పేతురు చర్చి

ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విద్యార్థినికి పురస్కారం అందజేస్తున్న శిష్టకరణం ఫౌండేషన్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన ఉత్తరాంధ్ర శిష్టకరణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. శిష్టకరణ యువత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం టౌన్ మెయిన్ రోడ్డులోని టర్నర్ చౌల్ట్రీ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మానాపురం సురేష్ నేతృత్వంలో 30 మందికి పురస్కారాలు అందజేశారు. రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్లు సదాశివుని కృష్ణ, ఉరిటి అప్పారావు, పోతుమహంతి నారాయణ, డబ్బీరు గాయత్రీ, పాల్తేరు జయ పట్నాయక్, మరడాము రవికాంత్ తదితరులు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చక్కని ప్రణాళికతో చదివి ఉన్నత ఆశయాలు, క్రమశిక్షణతో జీవించాలన్నారు. ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్ ఎగ్జామ్స్ లక్ష్యంగా చదవాలని అభిలషించారు.

నవ్వుల్లో ముంచెత్తిన వినోదాల విందు



కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా ఫ్రెండ్స్ కామెడీ క్లబ్(హైదరాబాద్), హ్యూమర్ క్లబ్ సంయుక్తంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో వినోదాల విందు పేరిట కామెడీ స్కిట్లు ప్రదర్శించారు. నగరంలోని విశాఖ హ్యూమర్ క్లబ్, హాస్యప్రియ కామెడీ క్లబ్, లాఫ్టర్స్ ఫన్ క్లబ్, విశాఖరత్న హాస్య క్లబ్, లాఫింగ్ క్లబ్, హాస్య దర్బార్, బాబాయ్ లాఫింగ్ క్లబ్‌లకు చెందిన కళాకారులు పాల్గొని కామెడీ స్కిట్లు ప్రదర్శించి నవ్వుల్లో ముంచెత్తారు. వీటిలో లఘునాటకం, ఫ్లై వోవర్, గాడిద కొడుకు, ఐఏఎస్ ఐపీఎస్, సాంకేతిక లోపం, పాజిటివ్ సూపర్ క్లయింట్, డాక్టరు పేషెంట్, ఊరకనే ఏటీఎం స్కిట్స్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. ప్రత్యేక ఆకర్షణగా జబర్దస్త్ ప్రకాష్ తనదైన శైలిలో కామెడీతో అలరించారు. కార్యక్రమంలో కళాకారులు ఎం.వి.సుబ్రహ్మణ్యం, ఎల్‌ఎస్ ఆర్ మూర్తి, రమణ, లక్ష్మి, నాగలక్ష్మి, మోహన్‌కృష్ణ, శారద, రంగారావు, త్రినాథ్, రావి గోపీకృష్ణ, శివజ్యోతి, భానుప్రకాష్, ఇంది ఈశ్వరరావు, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీ షీటర్లకు సూచనలిస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి నేరాల జోలికి పోకుండా ఉండాలని సూచించారు. గొడవలు, కొట్లాటలకు దూరంగా ఉంటూ కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలన్నారు. ఎలాంటి తగాదాల్లో తలదూర్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా కేసుల్లో ఉన్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తించుకుని మంచిగా నడుచుకోవాలని సీఐ సూచించారు. అనంతరం రౌడీ షీటర్లను వారి నివాసం వద్ద కుటుంబ సభ్యులకు పోలీస్ సిబ్బంది అప్పగించి వచ్చారు. ఎస్ఐలు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎర్నిమాంబకు విశేష పూజలు



అమ్మవారికి హారతి సమర్పిస్తున్న భక్తురాలు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ఈవో సురేష్‌బాబా నేతృత్వంలో అర్చకుడు శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలు కల్పించారు. భక్తులు మాంసహారాలతో వంటవార్పులు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఎర్నిమాంబ సంక్షేమ సంఘం సభ్యులు, ఆలయ ఉద్యోగులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రైల్వే ఉద్యోగి మృతి



కారులో మృతుడు సతీష్‌కుమార్

సీతమ్మధార: రైల్వే ఉద్యోగి ఒకరు కారులో మృతి చెందిన ఘటన ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. తాటిచెట్లపాలెం రైల్వే న్యూకాలనీలో నివసిస్తున్న కోమటిపల్లి సతీష్‌కుమార్(40) రైల్వేలో టెక్నీషియన్-3గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి తన నివాసం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో కారులో అతడు చనిపోయి ఉండటాన్ని స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతుడి సోదరుడు సునీల్ కుమార్ ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కారులో ఉన్న మృతుడి పక్కన గ్లాస్, మద్యం బాటిల్ ఉన్నట్లు గుర్తించారు. అధికారుల ఆదేశాల మేరకు హెచ్‌సీ షణ్ముకరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు యూనివర్సిల్ గ్రంథాలయం వద్ద వేసవి నేపథ్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ఆదివారం నిర్వాహకులు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ లైబ్రరీ దరి నగరానికే కీలకమైన పూర్ణామార్కెట్ ఉండటంతో నగర నలుమూలల నుంచి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారందరి దాహార్తిని తీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సిమ్మ అప్పారావు, వెంకట్, బాజ్జీ, హరీష్(అప్పు) తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



జయ శంకర్

ఎంవీపీ కాలనీ: పెదవాల్తేర్‌కు చెందిన వి.జయశంకర్ అదృశ్యంపై ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదవాల్తేర్ కాగితాల వారి వీధిలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్న జయశంకర్ 10వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో అతనికి 480 మార్కుల రావడంతో రెండు రోజులుగా మనస్తాపంతో ఉన్నాడు. ఈ నేపథ్యంలో శనివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన జయశంకర్ తిరిగి రాలేదు. లేత గ్రీన్ చెక్స్ షర్ట్, బ్లూ జీన్స్ వేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సంకీర్తన సార్వభౌముడు అన్నమయ్య



విజేతకు ప్రశంసాపత్రం అందిస్తున్న అతిథులు

సీతంపేట: శృతిలయ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి ఆశీస్సులతో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అన్నమాచార్యుని 615వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మకడిగిన పాదము పేరిట అన్నమాచార్య సంకీర్తన పోటీలు జరిగాయి. పౌర గ్రంథాలయం కార్యదర్శి డి.ఎస్.వర్మ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాగ్గేయకారుడిగా వేంకటేశ్వర స్వామి సేవలో తరించిన అన్నమయ్య సంకీర్తనా సార్వభౌమునిగా నిలిచారన్నారు. నాలుగు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు, గురువులు పాల్గొని ప్రతిభ చూపారు. విజేతలకు అతిథులు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు వి.ప్రభాకర్, సి.హెచ్.వి.సత్యనారాయణ, కొణతాల రాజు, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, ఎస్.ఎస్.ఎన్.రాజు, పుండరీ కుమార్, మేడా మస్తాన్‌రెడ్డి, తిరుమలరావు, ఫణిస్వామి, సుబ్రహ్మణ్యం, జె.ఎస్.ప్రసాద్, న్యాయనిర్ణేతలు, కళాభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకవి ఠాగూర్ జయంతి



ఠాగూర్ విగ్రహం వద్ద అంజలి ఘటిస్తున్న ఆచార్య వెంకటేశ్వర్లు తదితరులు

ఏయూ క్యాంపస్: విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ వీఎస్ కృష్ణా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. రవీంద్రుని విగ్రహానికి గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు పూలమాల వేసి, అంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశిష్ట రచనా శైలితో నోబెల్ బహుమతిని సొంతం చేసుకుని ఠాగూర్ భారతీయ సాహిత్య ప్రతిభను ప్రపంచానికి చాటారన్నారు. అటువంటి మహనీయుడు ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సైతం సందర్శించి, ప్రసంగించారని గుర్తు చేశారు. నేటి తరం విద్యార్థులు ఇటువంటి వారి రచనలను సమగ్రంగా చదవడం, అధ్యయనం చేయడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజగోపాల్, లైబ్రరీ అసిస్టెంట్స్, లైబ్రరీ టెక్నికల్ అసిస్టెంట్లు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘంటసాలను భారతరత్నతో గౌరవించాలి



ప్రసంగిస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దాడి వీరభద్రరావు

మద్దిలపాలెం: అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావును భారతరత్నతో గౌరవించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. ఘంటసాల ఆరాధకులు టెలిగ్రామ్ గ్రూప్ సభ్యుల సమర్పణలో ఘంటసాల ఆరాధనోత్సవాలను డాక్టర్ సయ్యద్ రహమతుల్లా ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ విశ్వవిఖ్యాత స్వరమాంత్రికుడు ఘంటసాల స్వరం సుస్థిరమైదన్నారు. విశ్వం ఉన్నంత వరకూ ఘంటసాల స్వరం వినిపిస్తునే ఉంటుందన్నారు. అనంతరం డాక్టర్ సయ్యద్ రహమతుల్లా ఘంటసాల అవధాన ప్రక్రియను అద్భుతంగా నిర్వహించారు. ప్రేక్షకులు ఘంటసాల పాటలలో పల్లవి, చరణంలో ఏ ఒక్కటి అడిగిన తక్కున ఆ చిత్రం పేరు, స్వరపరిచిన సంగీత దర్శకుడు, చిత్రం విడుదల తేదీలతో సహా చెప్పడమే కాకుండా ఆ పాటను కూడా ఆలపించి ఔరా అనిపించారు. ఐదుగురు గాయనీమణులు, ఐదుగురు గాయకులతో నిర్వహించిన పాటల కబడ్డీ అలరించింది. అనంతరం ఘంటసాల నాటిక ప్రదర్శించారు. కార్యక్రమంలో విజయనిర్మాణ అధినేత సూరపనేని విజయకుమార్, డాక్టర్.కె.రామమూర్తి, బి.కల్యాణి తమ గానంతో అలరించారు.

స్ఫూర్తిప్రదాత అల్లూరి సీతారామరాజు



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్



అల్లూరి చిత్రపటం నివాళులర్పిస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్ తదితరులు



అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేస్తున్న 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి

మహారాణిపేట: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమం ఆదివారం కేజీహెచ్‌లో జరిగింది. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ఈ సందర్భంగా అల్లూరి చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ సీతారామరాజు చేసిన పోరాటాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఇన్‌స్పెక్టర్ పి.శంకరరావు, సీనియర్ అసిస్టెంట్ ఆర్.మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మన్యం వీరుడికి ఘన నివాళి

జగదాంబ: జీవీఎంసీ 39వ వార్డు స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో అల్లూరి చిత్ర పటానికి సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్ పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అప్పారావు, చైర్మన్ మక్సూద్ అహ్మద్, సంస్థ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గౌరీశంకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- 35వ వార్డులో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఏఐటీయూసీ నాయకుడు ఎం.మన్మథరావు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుబ్బారావు, ముఠా కార్మికులు ఎం.ఆదినారాయణ, పైడిరాజు, సాంబయ్య, వెంకటరమణ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అమూల్యమైనది మానవ జన్మ



సత్యసందేశమిస్తున్న మాతా సద్గురు మోహిని

జగదాంబ: మానవ జన్మ అమూల్యమైనదని, ఈ జన్మలోనే పరమాత్ముడిని తెలుసుకోవాలని ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల జోనల్ ఇన్‌చార్జి మాతా సద్గురు మోహిని అహుజా జీ అన్నారు. పాతనగరంలోని మీర్పూరి హౌస్‌లో ఆదివారం నిర్వహించిన విశాలా సత్సంగం కార్యక్రమంలో ఆమె సత్యసందేశమిచ్చారు. ఈ సందర్భంగా సద్గురు మాతా సుదీక్ష మహారాజ్ మాట్లాడుతూ పరమాత్ముడి కోసం తెలుసుకోవాలంటే సద్గురు ద్వారా సాధ్యమవుతుందన్నారు. ప్రతి జీవిలో భగవంతుడు ఉంటాడని, సద్గురు ద్వారా బ్రహ్మజ్ఞానం పొందవచ్చన్నారు. హైదరాబాద్ సేవాదళ కమాండర్ రాకేష్ పాలజీ, విశాఖపట్నం సంత్ నిరంకారీ మండల ఇన్‌చార్జి ప్రేమ్, మీరాపూరి, పి.వి.రావు, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అంధుల సమాఖ్య ఉత్తరాంధ్ర యూనిట్ ఏర్పాటు

డాబాగార్డెన్స్: జాతీయ అంధుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖకు అనుబంధంగా ఉత్తరాంధ్ర యూనిట్‌ను ఏర్పాటు చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ఎస్.అర్జునరావు అధ్యక్షతన ఉపాధ్యక్షులుగా బి. సుమలత, గౌరీశంకర్, చిన్న, ప్రధాన కార్యదర్శిగా కె.సూరిబాబు, సంయుక్త కార్యదర్శులుగా పి.లక్ష్మి, కనకారావు, యువ కార్యదర్శిగా జి.సురేష్, కోశాధికారిగా ఎస్.జోషి కిశోర్‌ను ఎన్నుకున్నారు. సమాఖ్య రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి మోపూరి రామసుబ్బయ్య, ఉపాధ్యక్షుడు ధూళిపాల శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన అంధులు పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యాలు

టెన్త్ ఫలితాల్లో మెరిసిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు



రైల్వే హైస్కూల్ టాపర్ గంటా శైలజకు స్వీట్ తినిపిస్తున్న తల్లి తిరుపతమ్మ



దుర్గాకుమారి(564), జీవీఎంసీ-సీఎంఆర్ పాఠశాల



నీరజ్(558), జీవీఎంసీ-సీఎంఆర్ పాఠశాల



సీహెచ్ యశ్వంత్(554), జీవీఎంసీ-సీఎంఆర్ పాఠశాల



షేక్ షహీన(551), జీవీఎంసీ-సీఎంఆర్ పాఠశాల

డాబాగార్డెన్స్/అల్లిపురం: పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తమ ప్రతిభ చూపారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్ది అదే స్థాయిలో సౌకర్యాలను కల్పించింది. వాటిని సద్వినియోగం చేసుకున్న విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులై అందరితో శభాష్ అనిపించుకున్నారు.

- సీఎంఆర్-జీవీఎంసీ పాఠశాల నుంచి పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. వీరంతా బడుగు బలహీన వర్గాల వారే. తల్లిదండ్రులిద్దరూ రోజంతా కష్టపడితేనే వారి పోషణ. చదువుకు పేదరికం అడ్డురాదంటూ కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాల విద్యార్థి డి.లలితసాయి 586 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచాడు. తండ్రి కన్నాజీరావు ప్రైవేట్ ఉద్యోగి. తల్లి గృహిణి. తల్లిదండ్రుల కష్టానికి.. మంచి విద్యనందించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపాడు. మంచిగా చదివి ఐఐటీ ద్వారా చదివి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నానని లలిత్ సాయి తెలిపాడు. ఇదే పాఠశాల నుంచి దుర్గాకుమారి గుప్తా 564, నీరజ్ 558, సీహెచ్ యశ్వంత్ 554, షేక్ సహీన 551 మార్కులు సాధించారు. 500 మార్కులు పైబడి 17 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.
- స్థానిక ఎంజీఎం హైస్కూల్ నుంచి 110 మంది పరీక్షలకు హాజరు కాగా.. 30 మంది బాలురు, 18 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు. స్వాతి పాత్రో 552 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచింది, 537 మార్కులతో కట్టా సన్యాసినాయుడు, 513 మార్కులతో కాశీ నాని రెండు, మూడు స్థానాల్లో నిలిచారు.
- ప్రభుత్వ రైల్వే హైస్కూల్‌లో 58 మంది విద్యార్థులకు గాను 34 మంది పాసయ్యారు. 545 మార్కులతో గంటా శైలజ స్కూల్ టాపర్‌గా నిలిచింది. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు తమ అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

ఐఏఎస్ అవుతా..



నాన్న గారు లేరు. అమ్మ వ్యవసాయం చేస్తోంది. అమ్మకు భారంగా మారకుండా పాపా హోంలో చేరి ఎంజీఎం హైస్కూల్‌లో చదువుకున్నాను. ఐఏఎస్ అయి అమ్మకు తోడుగా నిలుస్తాను. కష్టపడి చదివి అనుకున్నదే సాధించడమే నా ధ్యేయం.

– కట్టా సన్యాసినాయుడు, పాపా హోం, ఎంజీఎం హైస్కూల్

ఐపీఎస్ నా లక్ష్యం

మా నాన్న గారు జి.రాజీవ్‌గాంధీ కరోనా సమయంలో మరణించారు. అమ్మ తిరుపతమ్మ హౌస్ మెయిడ్‌గా పనిచేస్తూ నన్ను చదివిస్తోంది. ఎంవీపీ కాలనీ నుంచి ప్రతి రోజు రైల్వే స్టేషన్ దరి హైస్కూల్‌కు వెళ్లేదాన్ని. హెచ్‌ఎం లక్ష్మణరావుతోపాటు పీడీ మాస్టర్ ఆర్.ప్రసన్నకుమార్‌ల ప్రోత్సాహం, సహకారంతో విజయం సాధించాను. వారి నమ్మకాన్ని ఐపీఎస్ అయి నిరూపించుకుంటాను.

– గంటా శైలజ, రైల్వే హైస్కూల్

బీచ్ క్లీనింగ్‌లో కృష్ణా కాలేజీ విద్యార్థులు



బీచ్ క్లీనింగ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

మద్దిలపాలెం: ప్లాస్టిక్ ఫర్ చేంజ్ పేరిట డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆదివారం బీచ్ క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. తీరంలో చెత్త, ప్లాస్టిక్ వస్తువులను సేకరించి పారిశుధ్య కార్మికులకు అందజేశారు. బీచ్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను సేకరించడంతో పాటు క్లీనింగ్ కార్యక్రమంలో భాగస్వాములైన ఎన్ఎస్ఎస్ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు పోలా ఉమామహేశ్వరరావు, రత్నభారతి, తదితరులు పాల్గొన్నారు.